# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ సోమవారం । 15 సెప్టెంబర్ 2025 । ■ 12 పేజీలు


4




## పెన్‌గంగ, ప్రాణహిత ఉగ్రరూపం

■ సరిహద్దులో నిలిచిపోయిన రాకపోకలు ■ మూడు రోజులుగా ప్రయాణికుల ఇబ్బందులు

# తుమ్మిడి హెట్టిపై సర్కార్ ఫోకస్

11



■ ప్రాణహిత-చేవెళ్ల నిర్మించేందుకు కసరత్తు

■ మహారాష్ట్ర సర్కార్‌తో చర్చించాలని నిర్ణయం

■ బాధ్యతలు సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్‌కు..

■ కాళేశ్వరంతో ఖర్చు తప్ప ఫలితం లేదన్న భావన

■ లిఫ్ట్ చేస్తే వేల కోట్ల కరెంటు బిల్లుల భారం

■ ప్రాణహిత నిర్మించి గ్రావిటీ ద్వారా నీరందించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిన ప్రాణహితకు మళ్లీ ప్రాణం పోయాలని రంగం సిద్ధం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ప్రాణహితను నిర్మిస్తామని చెబుతూ వస్తోంది. మరోవైపు.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారడంతో ప్రాణహితను నిర్మించి రైతులకు సాగు నీరు అందించాలని భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఆసిఫాబాద్ జిల్లా కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లో ప్రాణహిత నది వెంట రిటైర్డ్ ఇంజినీర్ విఠల్ రావు ఆధ్వర్యంలోని ఎస్వీ కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేపట్టింది. కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ రిపేరు, మెయింటెనెన్స్ ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయం దిశగా ఆలోచన చేస్తోంది.

-ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

8



### అటవీ గ్రామాలకు ఊరట..

## బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

■ 12 కిలోమీటర్ల మేర పనులకు రూ.25 కోట్లు మంజూరు ■ తీరనున్న కష్టాలు

■ మంచిర్యాల- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలను కలిపేలా రోడ్డు నిర్మాణం..

■ హర్షం వ్యక్తం చేస్తున్న రెండు జిల్లాల గిరిజనులు ■ పర్యాటక అభివృద్ధికి దోహదం

అటవీ ప్రాంతంలో బీటీ రోడ్డు మంజూరు చేసి, తమ దశాబ్దాల కలను సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఊట్ల నుంచి కుమరంభీం ఆసిఫాబా ద్ జిల్లా తిర్యాణి మండలం గుండాల వరకు రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా వేడుకుంటున్నారు. ఇప్పటివరకు ఆ వర్గంలో సరైన రవాణా సౌకర్యంలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

■ దాబాలో దహన సంస్కారాలు

■ అంత్యక్రియలకు భారీగా తరలివచ్చిన గ్రామస్తులు

■ చిన్నారుల మృతదేహాలు..! కన్నా వారి కడుపుకోత చూసి కన్నీళ్లు పెట్టుకున్న బంధువులు, గ్రామస్తులు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



5




## ఎరుపెక్కిన.. చంద్రవెల్లి

■ విప్లవ వీరుడికి అంతిమ వీడ్కోలు

■ అరుణాంజలి ఘటించిన విరసం, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు..

■ కంటతడి పెట్టించిన కళాకారుల పాటలు

■ మారుమోగిన అమర్ రహే నినాదాలు

■ అశ్రునయనాలతో కదిలిన జనం..

■ వేలాదిగా తరలివచ్చిన గ్రామస్తులు

■ చంద్రవెల్లిలో వెంకటి అంత్యక్రియలు..

ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ అటవీ ప్రాంతంలో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు ఏవోబీ రాష్ట్ర టెక్నికల్ టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి వెంకటి (56) అంత్యక్రియలు ఆదివారం చంద్రవెల్లిలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. నివాళులర్పించేందుకు ప్రజాసంఘాలు, అమరవీరుల బంధుమిత్రుల సంఘం నాయకులు తరలివచ్చారు. మృతదేహంపై ఎర్రని జెండా కప్పి, పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అమరుడా లాల్ సలామ్, జోహార్ కామ్రేడ్ వెంకటి అంటూ నినాదాలు చేశారు.



### అత్యాశనే ఆసరాగా సైబర్ నేరగాళ్ల మోసాలు

■ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

■ అపరిచితులు పంపే మేసేజ్‌లు చూడవద్దు

■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

### దారికో దండం.. ఎన్నాళ్లీ గండం

■ బురద దారిలో బిక్కుబిక్కుమంటూ...

■ పడి లేస్తూ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు

■ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం



# చిన్న నీటి వనరుల.. సర్వేపై జాప్యం



**ముథోల్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఉండే చిన్న నీటి వనరులు, ఇతర నీటి వనరుల లభ్యత, తద్వారా ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయో ప్రతి ఐదేళ్ల గురించి చేపట్టే చిన్న నీటి వనరుల సర్వేలో జాప్యం జరుగుతున్నది. సర్వే ఆరంభించాలని కేంద్రప్రభుత్వం ముఖ్యప్రణాళిక శాఖాధికారులకు ఆదేశించినప్పటికీ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో ఈ సర్వే చేపట్టాల్సి ఉంటుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీచేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు జారీ కాలేదు. సర్వే కోసం పంచాయతీ కార్యదర్శిని గానీ, వ్యవసాయ విస్తీర్ణాధికారి గానీ, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను గానీ వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఎవరితో సర్వే చేపట్టాలనే విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో జిల్లాలో చిన్న నీటి వనరుల సర్వేలో జాప్యం జరుగుతున్నది. మండలాల్లో పనిచేస్తున్న మండలపరిషత్ స్టాటిస్టికల్ ఆఫీసర్లచే రెండు గ్రామాల్లో సర్వే చేయాలని సీపీవో సూచించారు. ఆ గ్రామంలో ఉండే నీటివనరుల లభ్యత, తద్వారా సాగవుతున్న పంటల వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రతి ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో గల చిన్ననీటి వనరులైన చెరువులు, కుంటలు, బావులు, బోరు బావులు, ఎత్తిపోతల పథకాల్లో ఉన్న నీటిలభ్యత, సాగవుతున్న పంటల వివరాల గురించి సర్వేచేస్తారు. ఇప్పటివరకు ఆరుసార్లు సర్వే నిర్వహించగా, ప్రస్తుతం చేపట్టనున్న సర్వే 7వసారి కావడం గమనార్హం. ఈసారి గ్రామాల్లోనే గాకుండా పట్టణాలు, వాటి పరిసరాల్లో ఉండే నీటివనరులపై కూడా సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వే ఆధారంగా కేంద్రం ప్రభుత్వం దేశ అవసరాలకు, పంటల అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉందా, లేదా అని పరిశీలించనున్నారు. ఈ సర్వేను అనుసరించి నీటి వనరులను పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పథకాలను అమల్లోకి తీసుకరానున్నారు.

**ఈసారి యాప్ ద్వారా సర్వే..**

గ్రామాలు, పట్టణాల్లో గల చిన్న నీటివనరుల ద్వారా నీటి లభ్యత ఎంత ఉంది, వాటికింద ఎన్ని ఎకరాల భూములకు సాగు నీరు అందుతున్నాయి?. సాగు నీటి అవసరాలకే గాకుండా, తాగునీటి అవసరాలకు కూడా సద్వినియోగం అవుతున్నాయా, ఇతరత్రా అవసరాలకు కూడా సద్వినియోగం అవుతున్నాయా?. తదితర అంశాలపై సర్వే చేయనున్నారు. గతంలో మాన్యువల్‌గా కాగితాలపై సర్వే చేయగా, ఈసారి ఈ సర్వే కోసం రూపొందించిన యాప్ ద్వారానే సర్వే చేయనున్నారు. చిన్న నీటి వనరుల వద్దకు వెళ్లి సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ఓపెన్ చేసి వివరాలను నమోదు చేయాలి. చెరువులు, కుంటల వద్దకు వెళ్లి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా జియో ట్యాగింగ్‌తో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మొదట 100ఎకరాల లోపు ఆయకట్టు గల నీటి వనరులపై సర్వేచేసి, ఆ తర్వాత 100 ఎకరాలకు పైగా ఉన్న వాటి గురించి సర్వే చేయనున్నారు. 250ఎకరాల ఆయకట్టుకు పైబడిన వాటి గురించి వేర్వేరుగా సర్వే నిర్వహించనున్నారు. ఇవేగాకుండా బిందు, తుంపర సేద్యంలో నీటి లభ్యత, నిల్వ సామర్థ్యం, విద్యుత్ వాడకం, పంటల వివరాలను కూడా సేకరించాల్సి ఉంటుంది.



గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు కబ్జాకు గురై కనుమరుగయ్యాయి. కాగితాల్లో ఉన్న లెక్కల ప్రకారం క్షేత్ర స్థాయిలో నీటి వనరులు కనబడడం లేదు. ఈ సర్వే ద్వారా జిల్లాలో సజీవంగా ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయో తెలియనున్నది. ఈసారి సర్వే వివరాలను యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో పక్కాగా జరగనున్నది. సర్వేద్వారా వెల్లడయ్యే వివరాల ప్రకారం చిన్ననీటి వనరులను కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించనున్నది. ఈసర్వే ఒక్కకేంద్ర ప్రభుత్వానికే గాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఉపయోగపడనున్నది. ఈ విషయమై సీపీవోను సంప్రదించగా చిన్న నీటి వనరుల సర్వే ప్రస్తుతం ఎంపీఎస్‌వోల ద్వారా మండలానికి రెండు గ్రామాల్లో చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత ఆయా శాఖల సిబ్బందితో కలిపి అన్ని గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేస్తామని చెప్పారు.



## కడెం ప్రాజెక్ట్ 4 గేట్లు ఎత్తివేత

### హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

**కడెం, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో గత రెండు రోజుల నుండి భారీగా వర్షాలు కురువడంతో జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నీరు చేరుతుంది. ఆదివారం ఉదయం నీటి పారుదల శాఖ అధికారులు కడెం ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి దిగువ ప్రాంతం అగు గోదావరి లోకి 26809 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు వదిలారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 698.975 క్యూసెక్కుల, 700 అడుగులు, 4.438/4.699 టీఎంసీలు ఉండగా ప్రాజెక్ట్‌పై భాగమున భారీగా వర్షాలు కురవడంతో ప్రాజెక్ట్‌లోకి వరద నీరు భారీగా చేరుతుంది అని, ప్రాజెక్ట్ లోకి ఇన్ ఫ్లో 23460 క్యూసెక్కుల వరదనీరు చేరుతుంది అని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో కడెం ప్రాజెక్టుకు 18గేట్లు ఉండగా 4 గేట్లు ఎత్తి కింది భాగానికి వరద నీటిని దిగువ భాగమైన గోదావరిలోకి వదిలినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టుకు ఉన్న వెడమ కాలువ నుండి 637క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ నుండి 8 క్యూసెక్కుల నీటిని వదిలారు. గోదావరి నదితీర లోతోట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు, రైతులు, చేపలు పట్టేవారు గోదావరి నదిలోకి వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. ప్రాజెక్ట్‌కు చేరుతున్న వరద నీటి ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విట్టల్ తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ కడెం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## క్రీడాకారులు పోటీల్లో రాణించాలి : ఏరియా సింగరేణి జీఎం





**మందమర్రి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కార్మిక క్రీడాకారులు ఏరియా స్థాయి పోటీ ల్లో ప్రతిభ కనబరిచి కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధించాలని ఏరియా సింగరేణి జీఎం ఎన్ రాధాకృష్ణ కోరారు. ఏరియాలోని ఎల్లందు క్లబ్‌లో ఆదివారం వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 61వ వార్షిక క్రీడోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మిక క్రీడాకారులను అన్ని విధాలు గా ప్రోత్సహిస్తుందని క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించు కోవాలన్నారు. ఏరియా క్రీడాకారులు కోల్ ఇండియా పోటీలకు ఎంపికై పతకాలు సాధించి సింగరేణికి , ఏరియాకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని అయన కోరారు. అనంతరం టేబుల్ టెన్నిస్, షటిల్ బాడ్మింటన్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, పోటీలను ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి బ్రాం చ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ ఏరియా ప్రెసిడెంట్ రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సీనియర్ పిఓ, క్రీడల గౌరవ కార్యదర్శి ఎం కార్తీక్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలు

## పెంపునకు యాజమాన్యం నిర్ణయం

### జేబీసీసీఐ సభ్యులు లక్ష్మారెడ్డి

**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
దేశ వ్యాప్త బొగ్గు గనుల ప్రమాదాల్లో బాధితులకు అందజేసే ఎక్స్ గ్రేసియాను రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి వెల్లడించారు. బీఎంఎస్ అవిశ్రాంతమైన పోరాట ఫలితంగానే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ గ్రేషియా పెంచినం దుకు బీఎంఎస్ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. సింగరేణిలో కూడా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ బ్యాంక్ ఖాతా కలిగిన ప్రతి ఉద్యోగికి ఉచితంగా కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని కోల్ ఇండియాలో అమలు చేయించడం కూడా అఖిల భారతీయ ఖధాన్ మజ్దూర్ సంఘ్ (ఏబీకేఎంఎస్) చేసిన దీర్ఘకాలిక పోరాట ఫలితమేనని బీఎంఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి సత్తయ్య తెలిపారు. బొగ్గు తవ్వకం సహజంగానే ప్రమాదకరమైందని, బొగ్గు ఉత్పత్తి ప్రతి సంవత్సరం పెరుగుతున్న కొద్దీ కార్మికులలో ఆందోళన, ఒత్తిడి మరింతగా పెరుగుతున్నాయన్నారు. కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా సమగ్ర స్వల్పకాలిక, దీర్ఘకాలిక భద్రతా ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు. గనులలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సరైన మద్దతు అందించడానికి ప్రస్తుతం ఉన్న ఎక్స్ గ్రేషియా మొత్తాన్ని రూ. 15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.



### ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని

## తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాలతో వైరల్, విష జ్వరాలు మండలంలో విజృంభించడంతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులలో రోగులు కిటకిటలాడుతున్నారు. ఈ నేపథ్యంలో విషజ్వరాలతో బాధపడుతున్న రోగులకు వైద్యం అందుతుందా అనే ఆరా చేయడానికి నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం రాత్రి 11 గంటల సమయంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆకస్మిక తనిఖీ నిర్వహిచారు. ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తూ.. ఆసుపత్రిలో ఉన్న రోగులతో మాట్లాడారు. అలాగే ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి ఫార్మసీని తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.





# చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

**దాబాలో దహన సంస్కారాలు - భారీగా తరలివచ్చిన గ్రామస్తులు**

**చిన్నారుల మృతదేహాలు..! కన్నా వారి కడుపుకోత చూసి కన్నీళ్లు పెట్టుకున్న బంధువులు, గ్రామస్తులు**

**వాంకిడి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని దాబా గ్రామంలో నిన్న నీటి మడుగులో పడి మరణించిన చిన్నారులు వాడై మహేశ్వరి, అదే శశికళ, మొహరే గణేష్ తో పాటు అతని తల్లి నిర్మలకు ప్రజలు కన్నీటి వీడ్కోలు చెప్పారు. ఆదివారం దాబా గ్రామంలో చిన్నారుల దహన సంస్కారాలు నిర్వహించగా కుటుంబ సభ్యులు, బంధువులు, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది జనాలు తరలివచ్చారు. చిన్నారుల మృతదేహాలు..! కన్నా వారి కడుపు కోత చూసి జనాలు చెల్లించిపోయి కన్నీళ్లు పెట్టుకున్నారు.ఆ ప్రాంతం జనంతో నిండిపోయింది.

**బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే కోవలక్ష్మి**
దాబా వాగు మడుగులో పడి మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి కోరారు. ఆదివారం వాంకిడి మండలంలోని దాబా గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. చిన్నారుల మృతదేహాలను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. బాధిత మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇలాంటి దుర్ఘటన జరగడం బాధాకరమైన విషయమని,



మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అధికారులు తాగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను స్థానిక గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించేలా చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ అజయ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు అయ్యూబ్, సోయం భీం రావు, పీఏఎసీ ఛైర్మన్ పెంటు తదితరులు ఉన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**ఖానాపూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
మహిళలు, స్త్రీలు ఈ కాలంలో వెనుకబాటుతనాన్ని విడిచి అన్ని రంగాల్లో రాణించాలని, స్త్రీలకు దేవుని రాజ్యంలో ప్రత్యేక స్థానం కల్పించబడిందని సిస్టర్ ప్రవచనమ్మ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ చర్చి ఆఫ్ సౌత్ ఇండియా ఆలయంలో, దయాసిస్ మెదక్ ఆలయ ఆదేశాల అనుసారం స్త్రీల మహిళల ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. ఈ సందర్భంగా స్త్రీలు మాత్రమే ఆలయ ఆరాధనను ముందుండి నడిపించారు. ఈ సందర్భంగా సమాజంలో సావిత్రిబాయి పూలే,ఝాన్సీలక్ష్మీబాయి వంటి మహిళలు వీరోచితంగా ముందుకు సాగినట్లుగా చూస్తున్నామని, బైబిల్ లోని ప్రవక్తలు దెబోరా, ఎస్తేరు, యోహాన్న, సూసన్న, మరియ వంటి వారిని ఉదాహరణగా తీసుకొని స్త్రీలు సంఘంలో, సమాజంలో, కుటుంబంలో, బాధ్యతగా మెలగాలని ప్రవచనమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ రెవరెండ్ నక్క కిరణ్ కుమార్, స్త్రీల సమాజం సెక్రటరీ చంద్రకళ ఆంథోనీ, స్టువర్డ్ గంగుల దేవదాస్, సునీత, ఆశీర్వాదం, రవికాంత్, సుశీలమ్మ, మేరీ, సుజాత విలియమ్స్, విద్యాలత ఉన్నారు.

## నాటు వైద్యం చేసిన వ్యక్తి అరెస్ట్

**బోథ్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గొల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నాటు వైద్యం చేయడంతో కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మహిళకు డిస్కులు పాడవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీ సాయి తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలంలోని లక్ష్మీదేవి పల్లి గ్రామానికి చెందిన తిరుపతి రెడ్డి భార్య మిలుకూరి జ్యోతి కి అనారోగ్య నిమిత్తం గొల్లాపూర్ గ్రామానికి రాగా చందర్ సింగ్ స్వామి తో పాటు పలువురు ఆమెకు అవగాహన లేని ఆకులు, చెట్ల చెక్కలు ఇస్తూ పలు రకాలుగా నాటు వైద్యం చేయడంతో ఆమెకు ఎల్ త్రీ,ఎల్ ఫోర్, ఎల్ ఫైవ్ డిస్కులు పగిలిపోయాయని బాధితురాలు తెలిపింది. దీంతో బాధితురాలి ఆపరేషన్‌కు రూ.23,00,000. ఖర్చు అవుతుంది. అంతేగాకుండా నాటు వైద్యం చేసిన వారికి రూ.20,000 ఒకసారి ఫోన్ పే ద్వారా,




నగదు రూపంలో రూ. 1,50,000 ఖర్చు పెట్టించారని అన్నారు. మొత్తం కలిపి 24,70,000 రూపాయలు మోసపూ రితంగా నష్టం కలిగించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## రెబ్బన మండలంలో పులి సంచారం కలకలం

**రెబ్బెన, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో పులి సంచారం కలకలం రేపుతోంది. శనివారం గోలేటి పరిధిలోని సోనాపూర్.. అబ్బాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో పులి అడుగులను శనివారం స్థానిక రైతులు గుర్తించారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అటవీ శాఖ అధికారులు వచ్చి పులి అడుగులను నిర్ధారించాలని రైతులు కోరుతున్నారు. పులి సంచరిస్తున్నట్లు భావించి పరిసర ప్రాంతాల రైతులు.. రైతు కూలీలు భయంతో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు.





## దారికో దండం.. ఎన్నాళ్లీ గండం

**బురద దారిలో బిక్కుబిక్కుమంటూ...**
**పడి లేస్తూ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు**
**భయం భయంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళుతున్న గర్భిణులు, బాలింతలు**
**ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న రోడ్డు సమస్య**
**అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం**

**బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి కొల్హారి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన వంతెనకు ఇరువైపులా వేసిన మట్టి రోడ్డు బురదతో అస్తవ్యస్తంగా మారి వాహనాలు కూరుకపోయాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. కాగా మధ్యాహ్నం రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో ఇరువైపులా మట్టి రోడ్డు పూర్తిగా బురదగా మారి వాహనాలు ముందుకు సాగక దిగబడిపోయాయి. దీంతో ఇరువైపులా కిలోమీటరు వరకు రహదారిపైనే వాహనాలు స్తంభించిపోయాయి. వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులు వర్షంలో ఎటూ వెళ్లలేక ఉండిపోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో రహదారి బాగుచేయాలని కోరుతున్నారు.



## పన్ను వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకులు, ఇతర పనులను వేగవంతం చేయాలని, మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి రోజు ఇంటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి ఇంటికి నిరంతరంగా త్రాగునీటిని సరఫరా చేసేలా పనులను పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వార్డులలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో కృషి చేసి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కళ సాకారం అయ్యేవరకు ఉద్యమిస్తాం

## సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి

**మందమర్రి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కార్మికుల సొంతింటి కళ సాకారం అయ్యేవరకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 11, 12 వ తేదీల్లో సొంతింటి కళ సాకారం కోసం కార్మికుల అభిప్రాయ సేకరణలో భాగంగా నిర్వహించిన పోలింగ్ పత్రాలను ఆదివారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల అభిప్రాయ సేకరణలో బాగంగా చేపట్టిన పోలింగ్‌కు సింగరేణి యాజమాన్యం అడుగడుగునా అడ్డంకులు సృష్టించినప్పటికీ అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఏరియాలో నిర్వహించిన పోలింగ్ లో 2250 మంది కార్మికులు సొంతింటి కోసం, 133 మంది సింగరేణి క్వార్టర్ కావాలని, ముగ్గురు కార్మికులు రెండు కావాలని ఓటు వేశారని, ఏరియాలో 70 శాతం పోలింగ్ జరిగిందని, కార్మికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు వేశారని వారికి విప్లవాభి నందనలు తెలిపారు. సింగరేణిలో గుర్తింపు



సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికుల సమస్యలు స్ట్రక్చర్డ్ సమావేశాల ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తీరా ఎన్నికల్లో గెలిచిన తర్వాత యజమాన్యం నిర్వహిస్తున్న స్ట్రక్చర్డ్ సమావేశాల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సమావేశాలను బహిష్కరించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కార్మికులకు 35% లాభాల వాట సొంతింటి కళ వంటి ప్రధాన డిమాండ్లను స్ట్రక్చర్ సమావేశాల్లో పరిష్కరిస్తారని ఆశించిన కార్మిక వర్గానికి తీవ్ర నిరాశే మిగిలిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు పూర్తయినప్పటికీ నేటి వరకు కార్మికులకు లాభాల వాటా ప్రకటించలేదని మరో 15 రోజుల్లో దసరా పండుగ ఉన్నప్పటికీ గతంలో దసరా సందర్భంగా కార్మికుల లాభాల వాటా ఇచ్చే ఆనవాయితీ ఉండేదని ఈ స్ట్రక్చర్ సమావేశాల్లో దసరా పండుగకు ముందు కార్మికులకు లాభాల వాట ప్రకటించి చెల్లింపు తేదీని ప్రకటిస్తారని కార్మికులు ఆశగా ఎదురు చూస్తే వారి ఆశలపై గుర్తింపు సంఘం నీళ్లు చల్లిందని ఆయన మండిపడ్డారు. గుర్తింపు సంఘంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి యాజమాన్యంతో కలసి నాటకాలు ఆడుతుందని తీవ్రంగా విరుచుకు పడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కారం గుర్తింపు సంఘంతో సాధ్యం కాదని స్పష్టమైందన్నారు. సమస్యల పరిష్కారంపై గుర్తింపు సంఘానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని గతంలో ప్రకటించిందని దీనికి కట్టుబడి ఉండి అన్ని సంఘాలలో సమావేశానికి తేదీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నూతన బొగ్గు బ్లాకల కేటాయింపు కోసం సింగరేణి సంస్థ టెండర్లు వేయాలని చెప్పిన ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలపై స్పందించక పోవడం సరైంది కాదన్నారు. దసరా పండుగకు 15 రోజులు ఉన్నందున సంస్థ సాధించిన వాస్తవ లాభాలను యాజ మాన్యం ప్రకటించి లాభాల వాటాను వెంటనే చెల్లించాలని, సింగరేణికి రావలసిన ప్రభుత్వ బకాయిలు చెల్లించాలని, మారు పేర్లు సవరించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న సింగరేణి వ్యాప్తంగా జిఎం ఆఫీసుల ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### జంగం ఉర్దూ పాఠశాల నూతన భవనం, తాగునీటి

# సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**జైనూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలంలోని జంగం గ్రామ ఉర్దూ పాఠశాల కొత్త భవనం మంజూరు చేయాలని మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సజ్జాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, స్లాబ్ నుంచి నీరు కారుతోందని, ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా, తాగునీటి సమస్య పరిష్కారానికి కూడా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కోవలక్ష్మీ సానుకూలంగా స్పందించి, పాఠశాల భవన నిర్మాణానికి హామీ ఇచ్చారు. అదే విధంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల చైర్మన్ సాయద్ మహేబూబ్, సయ్యద్ సబీర్, శైక్ అల్తాఫ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



# అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న ముగ్గురు వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు వైద్య విద్యా సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్. తిప్పే స్వామి(ఆర్థోపెడిక్), పి.సత్యనారాయణ(ఈఎన్టీ), కౌస్తుభ విజయ సారథి(గైనకాలజీ) పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు. పదోన్నతులు పొందిన వారిని రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్, రిమ్స్ ఆచార్యులు అభినందించారు.

# ఆగస్టు 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మీషన్లు



**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
2025-2026 విద్యాసంవత్సరానికి గాను మంచిర్యాలలోని కాలేజ్ రోడ్ లో గల మ హాత్మ జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాలలో 15,16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో సేరు శ్రీధర్ ఆదివారం తెలిపారు. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు వివిధ కోర్సులలో ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందని, విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఉచిత భోజనం, హాస్టల్ వసతితో పాటు, యూనిఫామ్, టెక్స్ట్ బుక్, నోట్ బుక్స్, షూస్, ట్రాక్ షూట్, బెడ్ షీట్స్ అందజేస్తామని తెలిపారు.

**విద్యార్థుల సౌకర్యార్థం వసతులు...**
విద్యార్థుల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం ఉందని, నిపుణులైన అధ్యాపకులతో విద్యా బోధన, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 అండ్ 4, బ్యాంకింగ్, ఆర్ఆర్బీ, ఎస్ ఎస్ సీ, ఎస్సై, కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేకమైన కోచింగ్ అందజేస్తున్నారు. కెరియర్ గైడెన్స్ కోసం టాస్క్ వంటి సంస్థల సహకారంతో బోధన తరగతులు, ఫిజికల్ డైరెక్టర్ పర్యవేక్షణలో జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలలో పాల్గొనడం, వారాంతంలో వినోద కార్యక్రమాల వీక్షణం, హెల్త్ సూపర్ వైజర్ పర్యవేక్షణలో ప్రతిరోజు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, వివిధ కోర్సుల అకాడమిక్ పుస్తకాలతో పాటు అన్ని రకాల పోటీ పరీక్షలకు లైబ్రరీ సదుపాయం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో విద్యార్థులను తీర్చిదిద్దడం వంటి సదుపాయాలు కల్పించామన్నారు. సమాచారం కోసం 96037 05803, 91373 81807 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



# పెనుగంగా ఉగ్రరూపం

## సరిహద్దులో రాకపోకలు బంద్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెనుగంగా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సిర్పూర్ (టి) మండలంలోని వెంకట్రావుపేట వద్ద నది ఉధృతి కారణంగా వంతెనను అనుకొని నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో తెలంగాణ. మహారాష్ట్ర మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నది నీటి మట్టం తగ్గేవరకు ప్రజలెవరూ అటూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### ఎంపీ వంశీ కృషితోనే

# వందే భారత్ రైలు హాల్టింగ్

## కాంగ్రెస్ నాయకుడు రాజేష్ కుమార్

**మందమర్రి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విశేష కృషి చేస్తున్నారని ఆయన కృషితోనే మంచిర్యాల రైల్వే స్టేషన్లో వందే భారత్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కలిగిందని దళిత రత్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తుంగపిండి రాజేష్ కుమార్ స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలో ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేందుకు రైల్వే శాఖ నుండి అనేక రైళ్ల నిలుపుదలకు పార్లమెంట్‌లో, పార్లమెంటు బయట తన గళం వినిపిస్తున్నారన్నారు. వందే భారత్ రైలు నిలుపుదలతో ఈ ప్రాంతంలో వ్యా పారం, రవాణ సౌకర్యం మెరుగు పడుతుందని జిల్లా ప్రజలు రైల్వే రవాణాను సద్వినియోగం చేసు కోవాలని కోరారు.



# ప్రాణహిత కాలనీలో పిడుగుపాటుతో కాలిపోయిన ఎలక్ట్రికల్ పరికరాలు

**మందమర్రి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
పట్టణంలో గత రెండు రోజులుగా రాత్రి వేళలో ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం మూలంగా పిడుగుపాటుకు గురై విలువైన విద్యుత్ పరికరాలు కాలి పోయిన ఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పట్టణం లోని ప్రాణహిత కాలనీలో భారీ శబ్దంతో పిడుగు పడింది. కాలనీలోని 3, 4, నెంబర్ల బ్లాక్‌ల మధ్యలో నున్న చెట్టుకు పిడుగు పడటంతో రెండు బ్లాక్‌ల పరిధిలోని 16 మంది సింగరేణి కార్మికుల ఇండ్లలోని విలువైన ఎలక్ట్రికల్ పరికరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. రాత్రి భారీ వర్షం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవగా, ఒక్క సారిగా పిడుగు పడటంతో ఏం జరిగిందోనని కాలని వాసులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఒకవైపు భారీ వర్షం, దీనికి తోడు పిడుగు పడటంతో ఒక్క సారిగా రెండు బ్లాక్‌ల ఇండ్ల నుండి మంటలు చెలరేగి పొగలు రావడం, విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో కార్మిక కుటుంబాల సభ్యులు బిక్కుబిక్కు మంటు చిమ్మ చీకట్లో మగ్గాల్సి వచ్చిందని పలువురు వాపోయారు.





పిడుగుపాటుతో కార్మిక నివాసాల్లోని టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, సెటప్ బాక్స్ లు, ఏసీలు వంటి విలువైన ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయని దీంతో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనప్పటికీ ప్రాణ నష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



# ఎరుపెక్కిన.. చంద్రవెల్లి

- విప్లవ వీరుడికి అంతిమ వీడ్కోలు
- అరుణాంజలి ఘటించిన విరసం, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు..
- కంటతడి పెట్టించిన కళాకారుల పాటలు
- మారుమోగిన అమర్ రహే నినాదాలు
- అశ్రునయనాలతో కదిలిన జనం..
- వేలాదిగా తరలివచ్చిన గ్రామస్తులు
- చంద్రవెల్లిలో వెంకటి అంత్యక్రియలు..




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా చంద్రవెల్లి గ్రామం ఆదివారం సాయంత్రం విప్లవ గీతాలతో దద్దరిల్లింది. గురువారం ఛత్తీసగఢ్ గరియాబంద్ అడవుల్లో కేంద్ర బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మావోయిస్టు పార్టీ ఏఓబి రాష్ట్ర కమిటీ సభ్యులు జాడి వెంకటి అలియాస్ విమల్ అలియాస్ మంగన్న భౌతిక దేహం ఆదివారం సాయం త్రం చంద్రవెల్లి గామానికి చేరుకుంది. గ్రామస్తులు శనివారం ఉదయం చంద్రవెల్లి గ్రామం నుండి ఛత్తీస్‌గఢ్ వెల్లి గరియాబంద్‌లో పోస్టుమార్టం చేసి భద్రపరిచిన వెంకటి భౌతిక దేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి భౌతిక దేహాన్ని తీసుకువస్తున్న క్రమంలో మార్గమధ్యలో దారి తప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వార్ధా నది ప్రవాహం పెరగడంతో మూడు గంటల పాటు మృతదేహాన్ని తీసుకువస్తున్న ఆంబులెన్స్ అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో వెంకటి భౌతిక దేహం గ్రామానికి చేరుకుంది. వెంకటి భౌతిక దేహం ఆంబులెన్స్‌లో గ్రామానికి చేరుకోగానే విరసం నేతలు, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు భౌతిక దేహంపై ఎర్రజెండాను కప్పి కన్నీటి వీడ్కోల మధ్య విప్లవ నివాళులర్పించారు. మావోయిస్టు నేత జాడి వెంకటితో అనుబంధం ఉన్న చిన్ననాటి స్నేహితులు, సన్నిహితులు అంతిమయాత్రలో పాలు పంచుకున్నారు. అశేషంగా తరలివచ్చిన జనంతో చంద్రవెల్లి గ్రామం జన సంద్రంగా మారింది. అంతిమయాత్రలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు ఆర్.ప్రవీణ్, మాజీ జెడ్పిటిసి కారుకూరి రామ్ చందర్, టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్ నాథరి స్వామి, కాంగ్రెస్ నాయకులు చిలుముల శంకర్, తొంగల మల్లేష్ , ఏఐటీయూసీ నాయకులు మేకల దాసు, సిపిఐ మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, మేకల పోషమల్లు, తెలంగాణ ప్రజా పంట కరీంనగర్ ప్రధాన కార్యదర్శి ఆయిందాల అంజన్న, హనుమకొండ ఉపాధ్యక్షులు పెట్టం కుమారస్వామి, తెలంగాణ రైతు విధాన సమితి అధ్యక్షులు ముడిమడుగుల మల్లయ్య, విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాజన్న, సింగరేణి ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న,అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ కుమారి, ఉపాధ్యక్షురాలు శాంతక్క, సభ్యులు సత్యక్క, కవితక్క, అనిత, సోషల్ సైంటిస్ట్ మేడ ప్రవీణ్ కుమార్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కన్వీనర్ ఏ. సారయ్య, ఉమ్మడి కరీంనగర్ ఈసి మెంబర్ శ్రీపతి రాజగోపాల్, సభ్యులు యాదనవేని పర్వతాలు, ఎన్.సత్యనారాయణ, బండి శంకర్, బాలసాని రాజయ్య, ప్రజా కళామండలి అధ్యక్షులు ఏ .సమ్మయ్య, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు సమ్మ రాజయ్యలతోపాటు గ్రామస్థులు, లొంగిపోయిన మాజీ మావోయిస్టులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.



# ఇద్దరు దొంగల అరెస్ట్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని గురిజాల రైతువేదికలో జూలై 3న జరిగిన చోరీని పోలీసులు ఛేదించారు. ఎట్టకేలకు రెండు నెలలకు దొంగలను పట్టుకు న్నారు. పోలీసు స్టేషన్‌లో బెల్లంపల్లి రూరల్ సీఐ చందవోలు హనోక్ ఆదివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. గురిజాల రైతు వేదికలో రూ.1.90 లక్షల విలువ గల వీడియో కాన్ఫరెన్స్‌కు ఉపయోగించే ఎల్‌ఈడీ టీవీ, ఇతర సామగ్రి చోరికి గురైనట్లు వ్యవసాయ అధికారులు తాళ్లగురిజాల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌ఖు చెందిన మహమ్మద్ నసీమ్ బేగ్, బెల్లంపల్లి అశోక్‌నగర్‌కు చెందిన వర్మ శైలేష్‌లు జూలై 3న అర్ధరాత్రి ఆటోలో వచ్చి బండ రాయితో తాళం పగులగొట్టి ఎల్‌ఈడీ టీవీ, సౌండ్ బాక్స్‌లు, సీపీయూ, ఆంప్లీఫయార్, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆ సామగ్రిని బెల్లంపల్లిలో విక్రయిం చేందుకు వస్తున్నారు. తాళ్లగురిజాల పోలీసులు శనివారం వాహనాల తనిఖీలో ఆటోలో టీవీ, సామగ్రి అనుమానస్పదంగా కనిపించడంతో సదరు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఇద్దరు నిందితులను బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తాళ్లగురిజాల ఎస్సై బండి రామకృష్ణ, ఏఎస్సై అలీ, సిబ్బంది అరుణ్, మురళీ, శ్యామ్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**నర్సాపూర్(జి), సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని రాంపూర్ గ్రామం 61వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయయ్యాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. భైంసా పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన రోహిత్ (21), చంద్రకాంత్‌లు బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తున్నారు. మార్గ మధ్యలో అతివేగంగా, జాగ్రత్తగా నడుపుతూ నిలిపి ఉన్న ఎడ్లబండిని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో రోహిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు 108 వాహనంలో నిర్మల్ తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు.

# ఇందిరమ్మ ఇండ్లపేరిట ఇసుక దోపిడీ



**నెన్నెల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** ఇందిరమ్మ ఇండ్ల పేరిట నెన్నెల మండలంలో ఇసుక దోపిడీ యధేచ్ఛగా కొనసాగుతుంది. స్థానిక ఇండ్లకు ఇసుక పర్మిషన్ ఇవ్వని అధికారులు పక్కా మండలాలకు ఇసుక తీసుకుపోయేందుకు మాత్రం అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో దాదాపు 40 ఇండ్లకు ఇసుక లేక నిర్మాణాలు నిలిచి పోయాయి. స్థానిక వాగు నుంచి స్థానికులు ఇసుక తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన టోకెన్లతో ట్రాక్టర్లను తీసుకొని వెళితే అనుమతులు లేవంటు 5 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారని వాపోయారు. స్థానికంగా కర్జీ ఇసుక రిచ్ ఉన్నప్పటికీ అధికారులు మాత్రం మైలారం వాగు పేరిట అనుమతులను బెల్లంపల్లి మండలం ట్రాక్టర్లకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లపేరిట తరలిస్తున్న ఇసుక ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇసుక తరలింపుపై నిఘా లేక పోవడంతో ట్రాక్టర్ యాజమానులు ఇష్టరాజ్యాంగ బయట మార్కెట్‌లో రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తు కోట్లు దోచుకుతింటున్నారని సమాచారం. ఒక్క ఇంటికి 8 నుంచి 10 ట్రిప్పులు ఇసుకకు అనుమతులు ఇస్తున్నా, అన్ని ట్రిప్పులు యాజమానికి చేరడం లేదని సర్వత్రా ఆరోపణలు వినబడుతున్నాయి.

# 'చలో భద్రాచలం' విజయవంతం చేయండి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** 28న నిర్వహించే చలో భద్రాచలం కార్యక్రమాన్ని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని 9 తెగల ఆదివాసీలు విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివాసీ సంఘాల రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సోయం బాపూరావు, జిల్లాకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొని చలో భద్రాచలం పోస్టర్ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ జేఏసీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న హైదరాబాద్లో భారీ బహిరంగ సభ, ఆ తర్వాత ఢిల్లీలో సభ నిర్వహిస్తామని తెలిపారు. 9 తెగల సంఘాల నాయకులు, అడ్వొకేట్, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ప్రైవేట్ డిగ్రీ

# కళాశాలల బంద్

## నిరవధిక బంద్‌కు యాజమాన్యాల నిర్ణయం

**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాట పట్టాయి. నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి బకాయిలు చెల్లించ కపోవటంతో జిల్లాలోని 12 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఈనెల 16 నుంచి విద్యాసంస్థలను నిరవధికంగా బంద్ చేయాలని నిర్ణయించాయి. ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలకు సంబంధించి ఆర్టీఎఫ్ విడుదల చేయకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కళాశా లల అసోసియేషన్ కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టనున్నారు. మంగళవారం నుంచి నిరవధిక బంద్లో పాల్గొననున్నారు. బకాయిల చెల్లింపులో జాప్యంతో ఆర్థిక కారణాలతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావద్దనే ఉద్దేశంతో 2008లో అప్పటి ప్రభుత్వం బోధన రుసుముల చెల్లింపు పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు కోర్సుల రుసుం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందులో ఎంటీఎఫ్-మెయింటనెన్స్ ఆఫ్ ట్యూ షన్ ఫీ విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతుంది. రీయింబర్స్మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ (ఆర్‌టీఎఫ్) కళాశాలలకు చెల్లించే ఫీజు ఆయా యాజమాన్యాల ఖాతాల్లో జమఅవుతుంది. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడంలో తాత్సారంతో కళాశాలల నిర్వహణ భారంగా మారి ఉద్యోగుల జీతాలు, భవనాల అద్దెలు, రోజువారీ ఖర్చులు, కరెంట్ బిల్లులు, మున్సిపల్ టాక్స్, ఇతర బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొందని, కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులను దశలవారీగా కలిసినప్పటికీ ఫలితం లేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. డిగ్రీ కళాశాలలో కూడా తక్కువ ఫీజుతో గుణాత్మక మైన విద్యనందిస్తున్నాయని, ఎన్నోవేలమందికి ఉపాధి కల్పిస్తు న్నామని పేర్కొంటున్నారు. అనివార్య పరిస్థితుల్లో నిరవధిక బంద్కు వెళ్తు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# రియల్ ఎస్టేట్ కబ్జాలను అడ్డుకోవాలి

- ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్న పట్టింపు లేదు
- ఎమ్మెల్యే, ఎంపీలు భూములపై దృష్టి సారించాలి
- పేదలకు ప్రభుత్వ భూములను కేటాయించాలి
- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ డిమాండ్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ భూములు కబ్జాలు అవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదసి రవీందర్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలు, ఇరిగేషన్ కాలువలు కూడా కబ్జాకు గురవుతున్నాయన్నారు. పట్టణంలోని మోదెల శివారులోని సర్వే నెంబర్ 59/అలోని ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని ఆరోపించారు. అదే విధంగా బోట్లకుంట, మంగలి కుంట, చాకలి కుంట చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని వివరించారు. బోట్లకుంటలోని ఇందిరమ్మ గద్దె ప్రాంతంలోని కెనాల్, ఆ పరిసర ప్రాంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్టు వెల్లడించారు. మున్సిపాలిటీ, మండలంలోని పలు చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ధారించాలన్నారు. ఈ కబ్జాలపై రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు చూసిచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలపాలని ప్రశ్నించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఎంపీ వంశీ కృష్ణ లు ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ స్థలం ఉంటేనే ప్రజల కోసం పలు కార్యాలయాలను నిర్మించవచ్చన్నారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు హద్దులు లేకుండా పోతున్నాయని,ఇప్పటికే మందమర్రి మండలంలో ఇదే విధంగా కబ్జాలు జరిగితే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి పలు ప్రభుత్వ భూములను కాపాడినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ప్రభుత్వ నిషేదిత భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్ పేర్ల తో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ నిషేధిత జాబితాలోని భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారో ఆయా శాఖల అధికారులకే తెలియాలన్నారు. నాలా కన్వర్షన్ లేకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు గండి కొడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీతో పలు గ్రామాల్లో వెంచర్లు వేసి చుట్టూ పక్కల ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నట్లు తెలిపారు. సరైన అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను విక్రయిస్తున్న కూడా అధికారులు మామూలుగా తీసుకుంటున్న నేపథ్యంలో త్వరలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు కూడా చేపడతామని హెచ్చరించారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై తమ వైఖరి మార్చుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడి వాటికి హద్దులను నిర్ణయించి, ఆ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూములను పేదవారికి కేటాయించాలని వారు కోరారు.



## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

**ముథోల్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్సై బి. శ్రీనివాస్, ప్రతి వాహనదారుడు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించకూడదని, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ గగన్, రత్నాకాంత్, సంతోషి, సుమీర, సిబ్బంది పాల్గొన్నారు.

## వీఆర్ఏ శంకర్ మృతి

**తాండూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**



తాండూరు మండలంలోని చంద్రపల్లి గ్రామంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న బురుస శంకర్ (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల తహసీల్దార్ జ్యోష్ణ, డీటీ కల్పన, ఆర్ఐలు పద్మజా, ఎజాజోద్దీన్, సిబ్బంది, సంతాపం తెలిపి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

## బాధితుల కుటుంబాలకు అండగా ఉంటా

### ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్

**ముథోల్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**



ప్రమాదవశాత్తు ఇండ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ అన్నారు. ముథోల్ మండలంలోని బోరిగాంగ్రామానికిచెందిన లక్ష్మీబాయి అనే మహిళకు చెందిన ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో ఈవిషయంతెలుసుకున్న మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లేమోహన్ రావుపాటిల్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో తక్షణ సాయంగా ఆర్థిక సాయం అందజేశారు. ముథోల్ నియోజకవర్గంలో అనుకొని సంఘటనలు జరిగినప్పుడు ట్రస్ట్ అండగాఉంటుందన్నారు. ఇప్పటికే ముథోల్ నియోజకవర్గం ఇండ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సాయంతో పాటు, పేద కుటుంబాలకు రేకుల ఇల్లు నిర్మించిఇవ్వటం జరిగిందన్నారు. పాముకాటు, ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ట్రస్ట్ తరపున పది వేలు రూపాయల చొప్పున ఆర్థికసాయం చేస్తున్నమన్నారు. ఏదైనాసమస్యతలెత్తిన తమ దృష్టికి తీసుకువస్తే పేద ప్రజలకోసంసమస్య పరిష్కారంఅయ్యేంతవరకు తమ ట్రస్ట్ అండగాఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సుభాష్ జాదవ్, మాజీ సర్పంచ్ తులసి బాయి, స్థానిక కిష్టయ్య, గణేష్, యువకులు, తదితరులు, పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండ

**పెంబి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**



పెంబి మండలంలోని గుమ్మనా ఎంగ్లాపూర్‌లో పిడుగుపాటుతో మృతి చెందిన ఎల్లయ్య - లక్ష్మి దంపతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రకృతి విపత్తుతో మరణించిన వారికి 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, పిల్లలకు ఇందిరమ్మ ఇల్లు, గురుకులంలో సీటు ఇస్తామని హామీ ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెల్లి బాధిత కుటుంబాలను పరామర్శించి, నాగపూర్ లోని వారి ఇంటికి వెళ్లి పదివేల, గుమ్మనా ఎంగ్లాపూర్‌లోని మరో బాధితుని కుటుంబానికి ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు.



## సాంప్రదాయంగా బసవన్నకు అంత్యక్రియలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**

వ్యవసాయంలో 30 ఏళ్ల పాటు చేదోడువాదోడుగా నిలిచి, అనారోగ్యంతో మృతి చెందిన బసవన్న కు సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. బోరజ్ మండలంలోని లేఖర్ వాడ గ్రామానికి చెందిన అరికెల శ్రీకాంత్‌కు సంబంధించిన ఎద్దు అనారోగ్యంతో మృతి చెందింది. అయితే గత 30 ఏళ్లుగా వ్యవసాయంలో ఆయనకు చేదోడువాదోడుగా నిలిచిన ఎద్దు మృతి చెందడంతో యజమాని అరికెల శ్రీకాంత్ గ్రామస్తులతో కలిసి ఆదివారం ఎద్దుకు అంత్యక్రి యలు నిర్వహించారు. ఓ మనిషి చనిపోతే ఎలాగైతే అంత్యక్రియలు నిర్వహిస్తారో అంతే సాంప్రదాయబద్ధంగా డప్పు చప్పుల మధ్య ఎడ్ల బండిలో ఎద్దు మృతదేహాన్ని గ్రామ పురవీధుల గుండా అంతిమయాత్రగా నిర్వహించి, గ్రామ సమీపంలోని తన పంట పొలంలోనే ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

## కుంటాల జలపాతంలో చిక్కుకున్న యువకులు

### సురక్షితంగా బైటకు తీసిన గజ ఈతగాళ్ళు

**నేరడిగొండ, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల జలపాతంలో చిక్కుకున్న ఇద్దరిని పోలీసులు రక్షించారు. ఆదివారం సెలవు దినం కావడంతో జలపాతానికి పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. జలపాతాన్ని తిలకించేందుకు వచ్చిన నేరడిగొండ మండలంలోని పర్యాటకులు ఇద్దరు ఇస్మాయిల్ ఖాన్, షేక్ జమాయిల్‌లు జలపాతంలో చిక్కుకున్నారని స్థానికులు తెలపడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో జలపాతంలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను రక్షించారు.



## అత్యాశనే ఆసరాగా సైబర్ నేరగాళ్ల మోసాలు

- సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**

మనలో ఉన్న అత్యాశనే ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గత వారంలో 20 మంది ఇలాంటి మోసాలకు గురైన నేపథ్యంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా మోసపోతే వెంటనే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలన్నారు. మల్టీలెవెల్ మార్కెటింగ్, చైన్ కంపెనీల ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. పోలీస్ అధికారులు ఫోటోలు డీపీగా పెట్టుకొని అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మల్టీలెవెల్ మార్కెటింగ్, చైన్ కంపెనీల ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. ఇలా నకిలీ వ్యక్తులతో భ్రమ కల్పించి ఒకరిద్దరికి బహుమతులు ఇచ్చి ఆశలు రేకెత్తిస్తారని, ఇంట్లోనే ఉంటూ సులభంగా డబ్బు సంపాదించొచ్చని మాయ మాటలు చెబుతారని ఆయన అన్నారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరుల పేరు మీద ఇల్లీగల్ డ్రగ్స్ కొరియర్లు వచ్చాయని, వాళ్లు ఇంకేదో పెద్ద తప్పు పని చేశారని మిమ్మల్ని టెన్షన్‌లో పెట్టి బురిడీ కొట్టిస్తారని అలాంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లాటరీ తగిలిందని వచ్చే వాట్సాప్ మెసేజ్, పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను క్లిక్ చేసి, లేదా సోషల్ మీడియాలో కనిపించే లింకులని క్లిక్ చేసి మోసపోవద్దన్నారు. అనధికారిక లోన్ యాప్స్ నుండి చిన్న క్లిక్‌తో మీకు లోన్ వస్తుందనుకుంటే అంతకంటే పెద్ద అగాధంలో పడతారని ఎస్పీ హెచ్చరించారు. లోన్ ఇస్తున్నప్పుడు మీ ఫోన్లో డేటాను తస్కరించి అందులోని కాంటాక్ట్‌లకు అభ్యంతరకమైన మెసేజులు పంపుతారని ఆ లోన్ యాప్స్ పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే



**ముథోల్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, అయన వర్గీయులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అభివృద్ధిలో ముథోల్ నియోజకవర్గం వెనుకబడిందని అందుకే అభివృద్ధి కోసం అధికార పార్టీ లో చేరుతున్నానని మాట్లాడే మాజీ ఎమ్మెల్యే మీరు మీ కుటుంబమే 40 సంవత్సరాలు పాలించి కదా అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిందో చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ఆలయాలను అభివృద్ధి చేశామని చెబుతున్న మాజీ ఎమ్మెల్యే ముథోల్ నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి ఆలయ కమిటీల నుండి 10 నుంచి 20 శాతం ప్రభుత్వానికి డబ్బులు ఎందుకు కట్టిపించారో, అదే నిర్మల్ నియోజకవర్గంలో ఎలాంటి డబ్బు కట్ట కుండా నిధులు ఎలా మంజూరు అయ్యాయి. ఇది మీ అ సమర్థత కాదా అని ప్రశ్నించారు. దేశంలోనే పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ద్వారా ప్రభుత్వానికి కోట్లది రూపాయల ఆదాయం వస్తే 10సంవత్సరాల కాలంలో ఆలయాన్ని అభివృద్ధి చేయక పోవడంతో ప్రజలు మిమ్మల్ని చిత్తుగా ఓడించారన్నారు. ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అభ్యర్థన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఆధారాలతో సహా చూపించారు. భైంసా ఏరియా ఆసుపత్రిని తన స్వంత నిధుల వెచ్చించి అభివృద్ధి చేసిన విష యం మీకు తెల్వదా అని ప్రశ్నించారు. విద్య వైద్యం, సాగు నీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతు బ్రహ్మణ్ గావ్, సిరాల 50 చెరువులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే దేనన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్, సతీశ్వర్ రావ్, నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, నాయకులు భీమ్ రావ్,గోప సాయినాథ్, సతీష్ రెడ్డి, అప్పాల రాకేష్, పండిత్ రావ్, దేవోజీ భూమేష్, ఏనుపోతుల మల్లేష్, ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. సమావేశంలో బిజెపి మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు పాల్గొన్నారు.



## విద్యుదాఘాతంతో మేస్త్రీ మృతి

**మందమర్రి, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుండి ఉపాధి కోసం వచ్చి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుని ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని యాపల్ ఏరియాలో నివాసం ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్న సుకులాల్ యాదవ్ (31) ఆదివారం ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సుకులాల్ యాదవ్ ఉపాధి నిమిత్తం పట్టణానికి వచ్చి గత నాలుగు సంవత్సరాలుగా తాపి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు వారి విధులలో బాగంగా భోజనం చేసి విధులకు వెళ్లామని బోజనం చేసేందుకు సిద్ధం కాగా భోజనం వేడిగా ఉండగా చల్లార్చేందుకు కూలర్ స్విచ్ ఆన్ చేయగా ఒక్క సారిగా విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై 108కు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది చేరుకుని సీపీఆర్ చేసి నప్పటికీ, సుకులాల్ యాదవ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ అదనపు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**ఆర్థిక సహాయం అందచేత...**
సుక్ లాల్ యాదవ్ మృతదేహాన్ని స్వగ్రామమైన ఛత్తీస్‌ఘడ్‌కు తరలించేందుకు ఆర్థికంగా లేకపోవడంతో హిందూ స్మశాన వాటిక, కేకే ఓసి కమిటీ సభ్యులు, స్థానిక యువకులు కలిసి 70,000 వేల రూపాయలు విరాళాలు సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## నిర్మల్ విద్యార్థులకు రాష్ట్ర కరాటే పోటీల్లో అవార్డులు

**నిర్మల్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలోని బ్రైట్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని అవార్డులు గెలుచుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మురాద్, కరెస్పాండెంట్ అన్వార్ పాషా, సెన్సాయి రావుల సుదర్శన్, తేజేందర్ సింగ్ బాటియా, నేషనల్ సెన్సాయి కోచ్ యార్వ సాయి కిరణ్, పాఠశాల సిబ్బంది ముస్తాక్ ఖాన్ తదితరులు ఈ విజయం సాధించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు.



## సంఘ నిర్మాణ బలంతోనే సమస్యల పరిష్కారం




పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
సంఘ నిర్మాణం ఎంత బలంగా ఉంటుందో అంత సులువుగా సమస్యల పరిష్కారం ఉంటుందని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం పీఆర్టీయూ టీఎస్ భవనంలో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై తీర్మాణాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సంఘ నిర్మాణం బలంగా ఉంటేనే సమస్యలను అంతే సులువుగా సమస్యలను పరిష్కారానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించి సమస్యలపై తీర్మాణాలు తీసుకుంటున్నామని తెలిపారు. 33 జిల్లాల్లో వచ్చిన వాటిని రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సంఘం తరుపున ఉద్యమాల ఫలితంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీం నూతన కార్డులను మరో 15 అందించనున్నట్లు పేర్కొన్నారు. 2024 నాటికి జిల్లాలో 1500 ఉన్న సభ్యత్వాలుంటే నేడు 1800 అయ్యాయని తెలిపారు. జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్, ప్ర ధాన కార్యదర్శిస్వామి, రాష్ట్ర, జిల్లా,మండల బాధ్యులు పాల్గొన్నారు.



## దాడి కేసులో ఐదుగురు యువకుల అరెస్ట్

**తాండూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
తాండూర్ ఐబీలో పది రోజుల క్రితం జరిగిన తోపులాటలో ఓ వ్యక్తిపై దాడి చేసిన యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తాండూర్ ఎస్సై డీ కిరణ్ కుమార్ తెలిపారు. తాళ్లపల్లి సృజన్ గౌడ్ అనే యువకుడు ఈ నెల 5వ తేదీన రాత్రి తాండూర్ ఐబీ చౌరాస్తాలో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఈ కేసులో సుభద్రా కాలనీకి చెందిన అనిల్, సాయి, రాజు, నరేష్, హరిని అరెస్ట్ చేశామని, నిఖిల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. రౌడీ షీట్లు తెరవనున్నట్లు వెల్లడించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక చేయూత

**నార్నూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
పక్షం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రానికి చెందిన రాజ్ పొంగే బబన్ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మృతుడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల నిమిత్తం తన వంతుగా ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, దళిత అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు, దళిత అవార్డు గ్రహీత అన్నా బావు సాటె కమిటీ మండల అధ్యక్షుడు కోరల మహేందర్, మాజీ ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, బీజేపీ మండల అధ్యక్షుడు రాథోడ్ బిక్షపతి, నాయకులు షేక్ దాది అలీ, సయ్యద్ ఖాసిం, ధర్మ రక్షిత్, గుంజ చిన్నయ్య, శివాజీ, మోహన్, గణేష్, శ్రీరంగ్, దిగంబర్, శీను, దయానంద్, రాజు, సునీల్, అనిల్ తదితరులు ఉన్నారు.



# సిరికొండలో కొండచిలువ కలకలం

**సిరికొండ, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
సిరికొండ మండలం సూర్యపేట గ్రామంలో శనివారం రాత్రి భారీ వర్షం మధ్య భయాందో ళనకర ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని ఓ ఇంటి లోపలికి అనూహ్యంగా కొండచిలువ ప్రవేశించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా కలవరపడ్డారు. ఇంటి వారు గాఢ నిద్రలో ఉండగా పెద్ద శబ్దం వినిపించడంతో లేచి చూసి గదిలో కొండచిలువ ఉండటం గమనించారు. దాన్ని చూసిన వెంటనే భయంతో కేకలు వేయగా పక్క ఇళ్ల వారు అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో వర్షం కారణంగా అధికారులు లేదా ఇతరులు చేరే అవకాశం లేకపోవడంతో, గ్రామస్తులే ధైర్యం చేసి దానిని కొట్టి చంపేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏడాది ఒక కొండచిలువ గ్రామంలోకి రావడం జరుగుతోందని, ఇప్పటివరకు మూడు కొండచిలువలు ఇలా పట్టుబడ్డాయని చెప్పారు. వీటి బరువు సుమారు 10 నుండి 15 కిలోల వరకు ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు.





## అటవీ గ్రామాలకు ఊరట
# బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

- 12 కిలోమీటర్ల మేర పనులకు రూ.25 కోట్లు మంజూరు
- ప్రభుత్వం నిర్ణయంతో తీరనున్న ప్రజల కష్టాలు
- మంచిర్యాల-ఆసిఫాబాద్ జిల్లాలను కలిపేలా రోడ్డు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రెండు జిల్లాల గిరిజనులు

**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
అటవీ ప్రాంతంలో బీటీ రోడ్డు మంజూరు చేసి, తమ దశాబ్దాల కలను సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెంది న గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచి ర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామ పంచా యతీ పరిధి లోని ఊట్ల నుంచి కుమరంభీం ఆసిఫాబా ద్ జిల్లా తిర్యాణి మండలం గుండాల వరకు దట్టమైన అడవిలో రోడ్డు నిర్మిం చాలని ఆయా గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా వేడుకుంటు న్నారు. ఇప్పటివరకు ఆ మా ర్గంలో సరైన రవాణా సౌక ర్యంలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యం గా వర్షాకాలంలో వారి బాధలు అనేకం. కాలినడకన వెళ్లేందుకు కూడా మెటల్ రోడ్డు అనుకూలించే పరిస్థితులు లేవు. ప్రజల అ వస్థలు దృష్టిలో ఉంచుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గ తంలో మెటల్ రోడ్డు వేసినప్పటికీ కాలక్రమంలో అది గుంతలుపడి, రాళ్లు తేలడంతో ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండాల గ్రామం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నప్పటికీ అక్కడి ప్రజలకు ఏ అవసరం వచ్చినా స మీపంలో ఉన్న మంచిర్యాల జిల్లాకే వస్తుంటారు. వై ద్యం, నిత్యావసర సరుకుల కొనుగోలు, ఇతరత్రా అవ సరాల కోసం గుట్ట మీద నుంచి కాలినడకన, ద్విచక్ర వాహనాలు, ఎడ్లబండ్లపై దట్టమైన అటవీప్రాంతం గుండా దండేపల్లి, మ్యాదరిపేట, లక్షెట్టిపేట, మంచి ర్యాల వరకు ప్రయాణం సాగిస్తారు. రోడ్డు సౌకర్యం బాగాలేక అత్యవసర సమయాల్లో వైద్య చికిత్సల కోసం రోగులను మంచంపై పడుకోబెట్టి తం లించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రెండు గ్రామాలు గిరిజన ప్రాంతాలు కావడంతో ఇంతకాలం నాయకులు, అధికారులు సైతం పెద్దగా దృష్టిసారించలేదు.

**రూ. 25 కోట్లు మంజూరు....**
ఊట్ల-గుండాల గ్రామాలను అనుసంధానం చేసేలా బీటీ రోడ్డు నిర్మించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసా గర్‌రావు ఫిబ్రవరిలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కు లేఖ రాశారు. దండేపల్లి మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి కర్నపేట, ఊట్ల మీదుగా గుం డాల వరకు 12 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేప ట్టవలసిన ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేశారు. ప్రభుత్వం ఐటీడీఏ పరిధిలోని 12 గిరిజన గ్రామాలను అనుసంధానం చేసేలా బీటీ రోడ్ల నిర్మాణానికి ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నుంచి రూ. 465.55 కోట్లకు గత నెల 30న పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నంబర్ 240 జారీ చేసింది. ఇందులో దండేపల్లి నుంచి గుండాల వరకు ప్రతిపాధించిన రోడ్డుకు రూ. 25 కోట్లు కేటాయించడంపై ఆయా గ్రామాల గిరిజ నులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పర్యాటక అభివృద్ధికి దోహదం...**
ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం కాగా, ఆ ప్రాంత పర్యాటక అభివృద్ధికి సైతం దోహదపడ నుంది. రోడ్డు నిర్మాణం జరిగితే మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో ఉన్న ఊట్ల జలపాతం, పెద్దయ్య ఆలయం, స హ్యాద్రి పర్వతాలు (గుట్టలు), గుహలతోపాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గుం డాల జలపాతం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అలాగే దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో వణ్యప్రాణులు, రకరకాల పక్షులతోపాటు పచ్చని అటవీ ప్రాంతం పర్యాటకులకు కను విందు చేయ నున్నాయి. ఎలాంటి రోడ్డు సౌకర్యం లేకు న్నా... వర్షాకాలంలో ప్రతియేటా పర్యావరణ ప్రేమికులు పెద్దసంఖ్యలో ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. రోడ్డు నిర్మా ణం జరిగితే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగి, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉంది.



## రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

**రెబ్బెన, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్ మండలంలోని రహపల్లి గ్రామానికి చెం దిన సీహెచ్ అన్నరావు (47)మృతి చెందగా తిరుపతి. కృష్ణ కుమార్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలం వంకులం గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద రెండు ద్విచక్ర వా హనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదం అన్నరావు అక్కడికక్కడే మృతి చెందగా. తిరుపతి, కృష్ణ కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిరక్షిం చి వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వై ద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

## మహిళ అదృశ్యం..పోలీసులకు ఫిర్యాదు

**జైనూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**



జైనూరు మండలంలోని గూడమమడ గ్రామానికి చెందిన బూతింగే ఉర్మిళ (30) అనే మహిళ మూ డు రోజులుగా కనిపించ డం లేదని ఆమె తల్లి బోతింగే కళాబాయి పో లీసులకు ఫిర్యాదు చేసిం ది. ఈనెల 11న ఉదయం ఆటోలో జైనూర్ వైపు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని, ఆమె ఎత్తు సుమారు 5 అడు గులు, గోరువర్ణం, తెలుపు బ్లాక్ చీర ధరించి, ఎరుపు రంగు బ్యాగ్ తీసుకొని వెళ్లిందని వివరించారు. బంధు వుల వద్ద, గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించకపో వడంతో, ఎవరికైనా సమాచారం తెలిసినవారు వెంటనే జైనూర్ పోలీస్ స్టేషన్‌కు తెలియపర్చాలని జై నూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. బాధితురాలు తల్లి బోతింగే కళాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవు

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి తప్పకుండా కఠిన చర్యలు తీసుకోబడతాయని రామగుండం సిపి అన్నా రు. శనివారం రాత్రి పట్టణ లోని ఎన్టీఆర్ నగర్ లో మంచి ర్యాల డిసిపి భాస్కర్, ఏసిపి ప్రకాష్, ఆధ్వర్యంలో నిర్వహిం చిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో రామగుండం పోలీ స్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాలనీ వాసులతో మాట్లా డారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకోవడం తోపాటు ఏదైనా సమస్య ఉంటే ఏ సమయంలోనైనా పోలీస్ అధికారులకు, డయాల్ 100 కాల్ చేసి సమాచారం అందించినప్పుడు మంచిర్యాల పట్టణ పోలీ స్ వారు వెంటనే ప్రతిస్పందిస్తారని తెలిపారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన చట్ట వ్యతిరేకమైన కార్యక లాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా చట్ట వ్యతిరేకంగా చేసే చర్యల నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై నిఘాలో భాగంగా ఎన్టీఆర్ నగర్ లోని అనుమా నస్పద వ్యక్తులను, నేర చరిత్ర కలిగిన వారి ఇండ్లను,ఇంటి పరిసరాలను తనిఖీలు నిర్వహించరు ధ్రువపత్రాలు లేనటు వంటి వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్ర మంలో రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతా లలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగు తుందని దానిలో భాగంగా ఇలాంటి ప్రాంతం లను పూర్తిగా పోలీస్ ఆధీనంలోకి తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించడం కోసం, ఎలాంటి దృవ ప త్రాలు లేని వాహనాలను గుర్తించడానికి, అన్ క్లెయిమడ్ వాహ నాలు, ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు, తదితర వాటిని చట్ట విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచడం,అమ్మడం చేయ



డం, రవాణా చేసే వారిని గుర్తించడం, అదేవిధంగా ఈ కార్డ న్ అండ్ సెర్చ్ మరొక ముఖ్య ఉద్దేశం చట్ట ప్రకారం జీవనం సాగించే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే ప్రజలకు పోలీస్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని.వారికీ పోలీస్‌లు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మంచి ర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్,మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయం

### మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి భాస్కర్

**మంచిర్యాల, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
ప్రజలకు సేవా భావంతో మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయ మని మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, లయన్స్‌క్లబ్ నిర్వా హకులు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆది వారం జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ క్లబ్ ఆవరణలో మంచిర్యాల లయన్స్‌క్లబ్ చారిటబుల్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కరీంనగర్ రెనె ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపును నిర్వహించా రు. వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజే శారు. ఈ శిబిరంలో 460 మందికి వివిధ రకాల జబ్బుల కు సంబంధించిన వైద్య పరీక్ష లను నిర్వహించారు. డీసీ పీ భాస్కర్ క్యాంపును ప్రారంభించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ వర్షాకాలంలో సేవాభావంతో మెడికల్ క్యాంపు ఏర్పా టు చేయడం అభి నందనీయమన్నారు. దీని ద్వారా ప్రజలకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కలుగుతుందన్నారు. పేద ప్రజలు కొన్ని రోగాలకు వైద్య సేవలు ఉన్నప్పటికీ వారికి సరైన అవగా హన లేక ఆసుపత్రిలో వైద్యం చేసుకోవడం ఆర్థిక



భారం కావడంతో ఆసుపత్రికి వెళ్లలేకపోతారని, అటువంటి వారికి ఇలాంటి మెడికల్ క్యాంపులు మనోధైర్యం కల్పిస్తాయ న్నారు. అనంతరం నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సత్య పా ల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెనె ఆసుపత్రి ఆధ్వ ర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన ల భించడం సంతోషంగా ఉందన్నారు. పలు విభాగాల వైద్యులతో పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పం పిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు, రెనె ఆసుపత్రి ప్రతినిధులు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి తల్లి పేరుతో
# మొక్క నాటి సంరక్షించాలి

### అదనపు కలెక్టర్ డీఈవో దీపక్ తివారీ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
ప్రతి ఒక్క విద్యార్థి తన తల్లి పేరుతో మొక్క నాటి సంరక్షిం చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డీఈవో దీపక్ తివారీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వాళ్ళ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి సెల్ఫీ లేదా ఫొటో దిగి ఆ ఫొ టోను ECO CLUBS for MISSION Life Portal https:// clubs.education.gov.in/main పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.





## 'వైబ్' సాంగ్ అందుకే తీసేశారట

'మిరాయ్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబడుతుంది. రెండు రోజుల్లో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.55.6కోట్లు సాధించింది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఓ ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పకొచ్చారు. ఇంతకీ ఆయన ఏం మాట్లాడారు అంటే.. 'ఈ సినిమాను చిన్నారులకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో నిడివి విషయంలో జాగ్రత్త తీసుకున్నాం. నా నిర్ణయమైతే.. 4 గంటల నిడివి ఉంచేవాడినేమో. ఈ విషయంలో ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎప్పటికప్పుడు సింపుల్‌గా వెళ్దామని చెప్పేవారు' అని తెలిపారు.కార్తిక్ ఘట్టమనేని ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి కథకు అడ్డం వస్తున్నాయని రెండు పాటలు తీసేశాం. ఇందులో భాగంగానే 'వైబ్' సాంగ్ కూడా. సినిమాలో ఆ సాంగ్ కుదిరితే పెడదాం. లేకపోతే వద్దనుకున్నాం. ఐతే, ఆ పాట విడుదల చేసినప్పుడు 'ప్రమోషనల్ సాంగ్' అని చెప్పి ఉంటే బాగుండేది' అని ఆయన తెలిపారు. ఇక 'అశోకుడి తొమ్మిది గంథ్రాలు ఉన్నాయన్న కథ ప్రచారంలో ఉంది. హిట్లర్ సహా పలువురు వాటి కోసం ప్రయత్నం చేశారట. అలా ప్రచారంలో ఉన్న కథలకు ఫాంటసీ జోడించి కథను సిద్ధం చేసుకున్నాం' అని కార్తిక్ చెప్పకొచ్చారు.

## రామోజీ ఫిల్మ్ సిటీలో 'ఎస్ఎస్ఎంబీ29'

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎంబీ 29' (వర్కింగ్ టైటిల్) సినిమా శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఇటీవలే కెన్యాలో ఓ కీలక షెడ్యూల్‌ను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగొచ్చిన ఈ బృందం.. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ను మొదలు పెట్టింది. అక్టోబరు 10వరకు కొనసాగనున్న ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నారు. గ్లోబ్ ట్రాటర్.. అనే ఉపశీర్షికతో ముస్తాబవుతున్న ఈ చిత్రంలో మహేశ్ ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా తొలి లుక్ నవంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతమందిస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ కథ అందివ్వగా దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు.





## 'లెనిన్' క్లైమాక్స్ కోసం సన్నాహాలు

అక్కినేని యంగ్ హీరో అఖిల్ తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్‌లో చేస్తున్నాడు. ఇప్పటికే, 80 శాతం షూటింగ్ ను పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఆల్ రెడీ మొదలైంది. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్‌ను షూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్లైమాక్స్ షూట్ పూర్తి అయ్యాక, అఖిల్ తన పాత్రకు డబ్బింగ్‌ను కూడా పూర్తి చేస్తారట. ఈ క్లైమాక్స్ షూట్ ను ఈ నెల ఎండింగ్ లో తీసే అవకాశం ఉంది.కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. అఖిల్ మాడ్యులేషన్ కూడా పూర్తిగా చిత్తూరు యాసలోనే ఉండబోతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్ర యూనిట్ అనుకుంటున్న ప్లాన్ ప్రకారం ఈ చిత్రాన్ని నవంబర్ 14న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా అఖిల్ – శ్రీలీల కలయికలో లవ్ సీన్స్ చాలా బాగుంటాయట. అన్నట్టు ఈ సినిమా పై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు.



## 'ఓజీ' లో సర్‌ప్రైజ్‌లా..

'డీజే టిల్లు' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన నటి నేహా శెట్టి. ఇప్పుడామె పవన్ కల్యాణ్ 'ఓజీ' సినిమాలో ఓ సర్‌ప్రైజ్‌లా కనువిందు చేయనున్నట్లు స్పష్టత ఇచ్చింది. సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటించారు. నేహా ఇందులో పవన్‌తో ప్రత్యేక గీతంలో ఆడిపాడటమే కాక ఆయనతో కొన్ని కీలక సన్నివేశాల్లో పాలు పంచుకున్నట్లు తెలిసింది. ఆమె చేసిన ఆ పాటతో పాటు ఈ చిత్ర ట్రైలర్ ఈ వారంలోనే విడుదల కానున్నాయి. ఇక ఈ చిత్రం కోసం పవన్ తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించినట్లు చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాయి. ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. నేహా ప్రస్తుతం తెలుగులో ఓ కొత్త చిత్రానికి సంతకం చేసింది. దాన్ని నవంబరులో ప్రకటించనున్నట్లు ఆమె తెలిపింది.



## రైతులకు యూరియా అందజేయాలని
# బీఆర్ఎస్ నేతల రాస్తారోకో

**ఇచ్చోడ, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో రైతులు కదుపుమండి రోడ్డెక్కారు. కాంగ్రెస్ సర్కారు యూరియాను అందించడంలో విఫలమైందని ఆదివారం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మధ్యాహ్నం దాదాపు ఒంటి గంట నుంచి అర గంటపాటు నిరసన తెలిపారు. ఇరువైపులా వాహనాలు నిలిచాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. దీంతో ఆందోళన విరమించి బీఆర్ఎస్ నాయకులు, రైతులు మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియా అందించడంలో సర్కారు విఫలమైందని మండిపడ్డారు. రైతురాజ్యం కాదు.. కాంగ్రెస్ దగా రాజ్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పీఏసీఎస్ కేంద్రాల వద్ద రాత్రీపగలు తిండి, నిద్ర మానేసి పడిగాపులు కాస్తున్నామన్నారు. యూరియా సరఫరా చేసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సిరికొండ మాజీ సర్పంచ్ పెంటన్న, బీఆర్ఎస్ నాయకులు రోహిదాస్, లతీఫ్, బియ్యాల మల్లేశ్, రాజు, నర్సయ్య, ఏక్బాల్, సుభాష్, రమేశ్, పాండు పాల్గొన్నారు.

**నానో యూరియా వద్దు..**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(బీ) సహకార సంఘంలో యూరియా కోసం రైతులు ఆదివారం బారులుదీరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రెండు యూరియా బస్తాలతోపాటు ఒక నానో యూరియా బాటిల్ బలవంతంగా అంటగడుతున్నారని మండిపడ్డారు. ముందే యూరియా దొరకక ఇబ్బందులు పడుతుంటే.. నానో యూరియా అంటగట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నానో యూరియా పేరిట సతాయిస్తుందన్నారు. మండలంలోని మాన్కుగూడ, దేవుల్ నాయక్ తాండ గ్రామాల రైతులు తరలివచ్చి యూరియా కోసం ఇబ్బందులు పడ్డారు. సహకార సంఘం వద్ద కానిస్టేబుల్ రైతులను ఒక్కొక్కరిగా లోనికి పంపించారు. ఈ కార్యక్రమంలో ముక్రా (బీ) మాజీ సర్పంచ్ మారుతి, రైతులు అశోక్, ప్రహ్లాద్, దీపక్, వెంకటి, కైలాష్ పాల్గొన్నారు.





## కలెక్టరేట్ భవన శిథిలాల తొలగింపు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** కలెక్టరేట్ భవనానికి సంబంధించిన శిథిలాల తొలగింపు ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. కార్యాలయానికి సంబంధించి ఏ-సెక్షన్ బాల్కనీ పై అంతస్తు ఈనెల 11న ఒక్కసారిగా కుప్పకూలిన విషయం విదితమే. ఈ మేరకు శిథిలాల తొలగింపు ప్రక్రియను ఆర్ అండ్‌బి ఆధ్వర్యంలో ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కార్యాలయంలోకి జేసీబీ, వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో కూలీలతో తొలగిస్తున్నారు.

## గిరిజన పాఠశాలలో వైద్య శిబిరం

**ఖానాపూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆదివారం కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అప్పల చక్రవర్తి పిల్లలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.



## ఎస్టీ జాబితా నుంచి
# లంబాడీలను తొలగించాల్సిందే



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** ఎస్టీ జాబితా నుంచి లంబాడలను తొలగించే దాకా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్ కుమార్ అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ముఖ్య సమావేశంలో జిల్లా, మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1976లో అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా విద్య పరంగా అప్పటి రాజకీయనాయకులు తమ స్వప్రయోజనాల కోసం వెనుకబడిన వారు అనే నెపం తీసుకు వచ్చి కేవలం తాత్కలికంగా డీఎన్‌టీ(డీనోటిఫైడ్ ట్రైబ్)లుగా అవకాశం ఇస్తే అదే అదనుగా చూసి ఎస్టీలుగా చెలమణి అవుతూ రాష్ట్రంలో ఆదివాసీలకు అందించాల్సిన అభివృద్ధి ఫలాలు రిజర్వేషన్లు అన్ని లంబాడీలే అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ నాయకులపై లంబాడీ నాయకులు విమర్శలు చేస్తే ఉర్కునేది లేదన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే దాకా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఉద్యమ కార్యాచరణ ప్రకారం దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అక్టోబరు 6న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాదయాత్ర ప్రారంభిస్తామని అన్నారు. అక్టోబరు 15న అన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామని అన్నారు. అక్టోబరు 20న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, అక్టోబరు 30న ఐటీడీఏ కార్యాలయాల వద్ద వినతి పత్రాలను అందజేస్తామని చెప్పారు. నవంబరు 9న వరంగల్‌లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిసెంబరు 9న ఆసిపాబాద్ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో తుడుందెబ్బ నాయకులు విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, గణేశ్, రవిందర్, నర్సింగ్‌రావు, మోతిరాం, ప్రభాకర్ పాల్గొన్నారు.



## కలెక్టరేట్ ఏమైనా
# నిషేధిత ప్రాంతమా?

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ కలెక్టరేట్ ఏమైనా నిషేధిత ప్రాంతమా..? అని మాజీ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంకు అది సాధ్యం కాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న స్పష్టం చేశారు. కూలిన కలెక్టరేట్ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లిన తమ బీఆర్ఎస్ నేతలపై కేసు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పార్టీ శ్రేణుల తో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ... ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ వెళ్లి కూలిన కలెక్టరేట్ ప్రాంతాన్ని చూస్తే వారికి నిషేధిత ప్రాంతం కదా అని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ కు తొత్తులుగా వ్యవహరిస్తున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై కుట్ర పన్నుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రూ.55 కోట్లతో ప్రారంభించిన సమీకృత కలెక్టరేట్ భవనానికి, ప్రస్తుత కాం గ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు కేటాయించకపోవడంతోనే నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. పనుల జాప్యానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని మండిపడ్డారు. వెంటనే కలెక్టరేట్ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ, గంద్రత్ రమేష్, పవన్ నాయక్, గోవర్ధన్, యూనుస్ అక్బని, కానక రమణ, తదితరులు పాల్గొన్నారు.




## టెట్ పరీక్ష నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. ఆదివారం కేంద్రంలోని తిరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సంఘ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరాం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునిస్తూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయడం బాధాకరమన్నారు. కావున ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. అదేవిధంగా టెట్ సిలబస్ లో మార్పులు చేయాలని సూచించారు. ఏ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడు అదే సబ్జెక్టులో టేట్ పరీక్ష రాసే వీలు ఉండాలన్నారు. అదేవిధంగా అర్హత మార్కులు కులాలవారీగా కాకుండా అందరికీ ఒకే రకంగా ఉండాలని, 40% అర్హత మార్కులుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ అమలుకు కమిటీ వేయడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య కార్డులు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎస్ ను రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 317 బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకురావాలని కోరారు. మిగిలిపోయిన స్పౌజ్ బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని అమలు చేయాలని, పెండింగ్ డిఏలను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ శ్రీకాంత్ జలంధర్, జిల్లా గౌరవ అధ్యక్షులు బలిరామ్. రాష్ట్ర కార్యదర్శులు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ప్రఫుల్ చందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు అరుణ, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

# తుమ్మిడి హెట్టిపై సర్కార్ ఫోకస్



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. గత బీఆంఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిన ప్రాణహితకు మళ్లీ ప్రాణం పోయాలని రంగం సిద్ధం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ప్రాణహితను నిర్మిస్తామని చెబుతూ వస్తున్నది. మరోవైపు.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారడంతో ప్రాణహితను నిర్మించి రైతులకు సాగు నీరు అందించాలని భావిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే ఆసిఫాబాద్ జిల్లా కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లో ప్రాణహిత నది వెంట రిటైర్డ్ ఇంజినీర్ విఠల్ రావు ఆధ్వర్యంలోని ఎస్వీ కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డకు రిపేరు, మెయింటెనెన్స్ ఖర్చుతో కూడుకున్న అంశం కావడంతో ప్రభుత్వం ప్రత్యా మ్నాయం దిశగా ఆలోచన చేస్తున్నది.

**2008లో ప్రాణహితకు శంకుస్థాపన...**

ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద 2008 డిసెంబర్ 16న అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు నాటి ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారు. ప్రాజెక్ట్ ఎత్తుపై మహారాష్ట్ర అభ్యంతరం చెప్పడంతో ముందుకెళ్లలేదు. దాంతో తెలంగాణ వచ్చాక ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో బీఆర్ఎస్ సర్కార్ ప్రాణహితను పక్కనపె ట్టేసింది. తుమ్మిడిహెట్టి నుంచి లొకేషన్ ను మేడిగడ్డకు మార్చింది. అంతేకాకుండా ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేసి.. అధిక వడ్డీలతో అప్పులు తెచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికల వేళ మేడిగడ్డ కుంగిపోయింది. దాంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్గా తీసుకుంది. ఈ క్రమంలో ప్రాణహితను తెరమీ దకు తీసుకొచ్చింది. కాంగ్రెస్ గెలిచాక ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించి తీరుతామని స్పష్టం చేసింది. అందులో భాగంగానే ఇప్పటికే ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించింది. మహారాష్ట్ర వైపు ఉన్న గ్రామాలు, అడవి, అక్కడి భూముల వివరాలు, నది స్వభావం, స్థితి, లాంగిట్యూడ్, లాటిట్యూడ్, లోతు వివరాలను సర్వే సంస్థ నమోదు చేసింది.

**మహారాష్ట్రతో త్వరలోనే చర్చలు...**

మహారాష్ట్రతో ఎలాంటి వివాదాలు రాకుండా తుమ్మిడిహె ట్టికి దిగువన రిజర్వాయర్ నిర్మించాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తున్నది. ప్రాణహిత నది నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న 165 టీఎంసీల నీటిని ఒడిసిపట్టి ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు, ఎల్లంపల్లి నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది. గతంలో నిర్మించిన 70 కిలోమీటర్ల పొడవైన కాల్వలను ఉపయోగంలోకి తీసుకొస్తే మేలు జరుగుతుందని భావిస్తున్నది. ప్రాజెక్టు ఎత్తు విషయమై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. ఈ మేరకు బాధ్యతలను ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథాస్‌కు అప్పగించారు. గతంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని 152 మీటర్లుగా ప్రతిపాదించారు. అంత ఎత్తులో బ్యారేజీ నిర్మాణంతో తమ భూభాగంలో ముంపు ఏర్ప డుతుందని మహారాష్ట్ర అభ్యంతరం తెలిపింది. ఈ కారణంతోనే ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించిందని మాజీ మంత్రులు చెబుతున్నారు. అందుకే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను దౌత్యపరంగా పరిష్కరించాలని భావిస్తున్నది. 148 మీటర్ల ఎత్తులో నిర్మించుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే.. తెలంగాణ ప్రభుత్వం 152 మీటర్లకు ప్రతిపాదనలు ఇచ్చింది. దానికి అంగీకరించకపోవడంతో 150 మీటర్లకు తగ్గించి నిర్మించేందుకు మహారాష్ట్రను ఒప్పించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే సీఎం రేవంత్ సైతం అసెంబ్లీ వేదికగా ప్రకటన చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తామని వెల్ల డించారు. అందులో భాగంగానే.. మరికొద్ది రోజుల్లోనే చర్చలు జరిపేందుకు సన్నద్ధం అవుతున్నట్లు తెలిసింది.

**కాళేశ్వరంతో మోయలేని భారం...**

ఇప్పటికే రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేసి గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. అయితే.. ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి రెండు పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయి. ఇప్పుడు దానికి రిపేరు చేయించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అంతేకాకుండా.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోయాలంటే వేల కోట్ల కరెంటు బిల్లులు వస్తున్నాయి. దాంతో అది కూడా ప్రభుత్వంపై అదనపు భారం తప్పితే పెద్దగా సాగునీరు అందే అవకాశం తక్కువేనని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే.. అటకెక్కిన ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పునరుద్ధరించే దిశగా కీలక అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా ప్రాణహిత నదిపై ఆదిలాబాద్ జిల్లా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మళ్లీ కసరత్తు మొదలుపెట్టింది. తక్కువ ఖర్చుతోపాటే గ్రావిటీ ఆధారంగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేలా నిర్మిం చాలని రూపకల్పన చేస్తున్నది. ప్రాణహిత-చేవెళ్ల నిర్మాణంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరడంతో.. కాళేశ్వరం విద్యుత్ భారం సైతం తగ్గుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది.

**ప్రాణహితతోనే ప్రయోజనం....**

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి ప్రభుత్వం పలు సానుకూల అంశాలను ప్రతిపాదిస్తున్నది. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్(జీడబ్ల్యూడీటీ) తీర్పు ప్రకారం ఇక్కడ 165 టీఎంసీల నీటి లభ్యత ఉంది. ఈ నీటిని గ్రావిటీ ద్వారానే ఆయా ప్రాంతాలకు, జిల్లాలకు తరలించొచ్చు. మరోవైపు.. తుమ్మిడిహెట్టి నుంచి నీటిని ఎత్తిపోయడానికి అయ్యే ఖర్చు, కాళేశ్వరంతో పోలిస్తే నామమాత్రమే. అంచనాల ప్రకారం తుమ్మిడిహెట్టి బ్యారేజీకి అయ్యే వార్షిక కరెంటు ఖర్చు సుమారు రూ.150 కోట్లు మాత్రమే. అదే కాళేశ్వరం ప్రాజెక్టుకు దాదాపు ఏడాదికి రూ.12వేల కోట్ల వరకు విద్యుత్ బిల్లులకే చెల్లించాల్సి వస్తున్నది. గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని అందించడం వల్ల ఈ ఖర్చంతా ఆదా కానుంది. మరోవైపు.. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 72 కిలోమీటర్ల పొడవైన ప్రధాన గ్రావిటీ కెనాలు నిర్మించింది. ఇప్పుడు ఆ కాలువను వినియోగించుకుంటే నిర్మాణ వ్యయం, సమయం రెండూ ఆదా అవుతాయని పలువురు నిపుణులు వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే తక్షణమే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు 2 లక్షల ఎకరాలకు స్థిరమైన సాగునీరు అందుతుంది.ప్రాణహిత నీరు ఎల్లంపల్లికి చేర్చడం వల్ల ఉత్తర తెలంగాణతో పాటు సూర్యాపేట జిల్లాకు నీరిచ్చే వెసులుబాటు కలుగుతుంది.

- ప్రాణహిత-చేవెళ్ల నిర్మించేందుకు కసరత్తు
- మహారాష్ట్ర సర్కార్‌తో చర్చించాలని నిర్ణయం
- బాధ్యతలు సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్‌కు..
- కాళేశ్వరంతో ఖర్చు తప్ప ఫలితం లేదన్న భావన
- లిఫ్ట్ చేస్తే వేల కోట్ల కరెంటు బిల్లుల భారం
- ప్రాణహిత నిర్మించి గ్రావిటీ ద్వారా నీరందించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

## 'తమ్మిడిహట్టి' నిర్మాణానికి ప్రణాళికలు.. అధికారులతో సమీక్షలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్సీ అమ్జద్ హుస్సేన్ తదితరులతో జలసౌధలో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 32.4 మిల్లీమీటర్ల వర్షం

**ఆసిఫాబాద్,సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)** కుమరంభీం ఆసిపాబాద్ జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చింతలమానేపల్లిలో 88.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కౌటాలలో 63.4, వాంకిడిలో 49.2, ఆసిఫాబాద్‌లో 44.8, బెజ్జూర్‌లో 31.4, సిర్పూర్(యూ)లో 26.4 దహెగాంలో 25.4, సిర్పూర్(టి)లో 25.2 రెబ్బెనలో 23.0, కెరమెరిలో 22.4, పెంచికల్‌పేటలో 22.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. లింగాపూర్, తిర్యాణి మండలాల్లో 20.8, కాగజ్‌నగర్‌లో 16.0, జైనూరులో 7.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాతో పాటు ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు పెన్‌గంగ ప్రమాద స్థాయిలో వంతెనను తాకుతూ ప్రవహిస్తుండటంతో అటువైపు రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జూరు మండలంలో లోలెవల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుమ్రరంభీం ప్రాజెక్టులోకి 3,091 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి 2, 088 క్యూసెక్కుల వరదనీటిని అధికారులు కిందికి వదిలారు. దీంతో పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

**ఉప్పొంగిన వాగు.. నిలిచిన రాకపోకలు...**

**బెజ్జూరు :** బెజ్జూరు మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి కృష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో హైలెవల్ వంతెనలు లేని కారణంగా ఏటా వర్షకాలంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

**ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగ...**

**సిర్పూర్(టి) :** ఎగువన మహరాష్ట్రలో కురుస్తున్న బారీ వర్షాలకు ఆదివారం సిర్పూర్(టి) మండలంలోని వెంకట్‌రావుపేట పొడ్స గ్రామాల మధ్య ఉన్న పెన్‌గంగ ప్రమాదకర స్థాయిలో వంతెనను అనుకొని ఉప్పొంగి ప్రవహిసోంది. అలాగే పెన్‌గంగా ఉప్పొంగి ప్రవహిస్తుండ టంతో బ్యాక్ వాటర్‌తో సిర్పూర్(టి)-హుడ్కిలి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో సిర్పూర్ (టి)-మహరాష్ట్ర వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు అటువైపు వెళ్లకుండ రెవెన్యూ, పోలీసు అధికారులు వంతెనల వద్ద పోలీసు పహరాను ఏర్పాటు చేశారు. పెన్‌గంగా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత...**

**కౌటాల :** కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ఉన్న ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వార్ధానది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో తుమ్మిడిహెట్టి వద్ద భారీగా నీటి ప్రవాహం పెరిగింది. పుష్కరఘాట్ల మెట్ల వద్దకు తాకుతూ ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం పెరుగుతుండటంతో పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రతమత్తమై ఎవరినిలోనికి పోనియకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.



# 90 రోజుల్లో ఏసీబీకి చిక్కిన 84 మంది లంచవతారులు

- సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్..
- టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచన
- అధికారులు, ఉద్యోగవర్గాల్లో విస్తృత చర్చ
- అక్రమార్కులపై ఏసబీ వినూత్న ప్రచారం




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
లంచం తీసుకునే అధికారులు పట్టిద్దాం – అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం!! అంటూ అవినీతి నిరోధక శాఖ విస్తృత ప్రచారం చేస్తున్నది. ఇందుకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన వస్తున్నది. లంచగొండుల్ని ప్రభుత్వం డిస్మిస్ చేసి వారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలి అంటూ సోషల్ మీడియా ప్లాట్ఫార్మ్లో జనం తీవ్రంగా స్పందిస్తున్నారు. మరో వైపు సస్పెండ్ అనే చిన్నవాటితో సరిపెట్టొద్దు. అవసరమైతే చట్టాల్లో మార్పులు చేసైనా వీరిని చేయాలన్న డిమాండ్ పెరుగుతున్నది.

**3 నెలల్లోనే ఇంతదొంగలా..?**
దొరకని దొంగదొర లెంతమందో..! అంటూ ఏసీబీ అధికారులు విడుదల చేసిన లంచావతారుల చిట్టాపై విరుచుకుపడుతున్నారు. ఇందులో రేపో మాపో రిటైర్ అయ్యేవాళ్ళు కూడా ఉన్నారు. రిటైర్ అయితే అమ్యామ్యాలకు ఛాన్స్ దొరకదని అధికారులు ఉద్యోగులు కక్కుర్తి పడుతున్నారంటూ సోషల్ మీడియాలో మండిపడుతున్నారు. నిరుద్యోగులుగా ఉన్న వేలాదిమంది ఎంటెక్, బీటెక్‌లు చేసి ఉద్యోగాలు రాక, పెళ్లిళ్లు లేక నెలకు 20–30 వేల జీతాలకే పనిచేస్తున్న యువత పరిస్థితి ఏంటి అంటూ ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగాలతో మంచి జీతాలు, సంఘంలో... బంధువుల్లో గౌరవం.. ఇవి చాలక విలాసాలకి కక్కుర్తి పడి, జలగల్లా జనాల్ని పీడించి లంచాలు తీసుకుంటూ కుప్పలు తెప్పలుగా పోగేసుకుంటూ ఏసీబీకి పట్టుబడుతున్న వారిని డిస్మిస్ చేసే చట్టాలను తయారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఏసీబీకి దూకుడు..**
గతంలో ఏసీబీ కేసులు అత్యంత అరుదుగా జరిగేవి. కానీ గడిచిన మూడు నెలల కాలంలోనే తెలంగాణలో 84 మంది అధికారులు ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడడం తీవ్ర చర్చనీయాంశం అవుతుంది. దీంతో ఏసీబీకి సమాజంలో భలే క్రేజ్ పెరిగిపోతున్నది. దీనికి తోడు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ పెట్టి విస్తృత ప్రచారం చేస్తున్నది. ఈ కారణంగా ప్రభుత్వ కార్యాలయాలలో పనుల కోసం వచ్చేవారిని వేధిస్తున్న ఉద్యోగులు అధికారులు ఏసీబీ అధికారులను ఆశ్రయించడం పెరుగుతున్నది.

# ప్రజల అభివృద్దే రాష్ట ప్రభుత్వ లక్ష్యం

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రజల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని రాజూర గ్రామంలో 20 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ సభ్యుడు గోడెం నాగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీ గోడెం నగేష్ మాట్లాడుతూ.. భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులతో కొట్టుకపోయిన రోడ్ల మరుమతులు చేపిస్తామని ఎంపీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది అని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మండలంలోని బాధనకుర్తి గ్రామంలోని, దాసునాయక్ తండా, పెంబి మండల కేంద్రంలో, కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామంలో 12 లక్షల వ్యయంతో మంజూరు అయినా అంగన్వాడీ కేంద్రా భావనలకు ఎమ్మెల్యే భూమి చేశారు. వరద బాధితులకు సైతం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భూమన్న, వైస్ చైర్మన్ అబ్బుల్ మజీద్, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోనికేని దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజూరా సత్యం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మల రమేష్, జంగిలి శంకర్, గుడాల భూమన్న, బొడ్డు నర్సయ్య, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# కాగజ్‌నగర్‌లో మరిన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు హాల్టింగ్

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్‌లో మరిన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు హాల్టింగ్ ఇచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలుకు కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం హాల్టింగ్‌ను రైల్వే అధికారులు ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే హరీష్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మిఠాయిలను పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మరిన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆగేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ నెల 18న వందే భారత్ సూపర్ ఫాస్ట్ హాల్టు కాగజ్‌నగర్ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టెలికాం అడ్వయిజరీ కమిటి సభ్యుడు ప్రభాకర్ గౌడ్, బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, అరుణ్ లోయా, చిలువేరు ప్రవీణ్‌బీ పవన్ బల్దువా, చిప్పకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్ నార్సింగలో నిర్వహించే ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌పో ద్వారా కొత్త సాంకేతిక పరిజానం, ఆధునిక పరికరాలపై ఫొటో గ్రాఫర్స్ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యూ లైఫ్ ఫెలోషిప్ చర్చి పాస్టర్ బోడపాటి జయంత్, జిల్లా బాలల సంరక్షణ సమితి కౌన్సిలర్ పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం ష్యూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో చర్చిలో నిర్వహించిన బాల్యవివాహ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా బాల్యానికి అతిపెద్ద ముప్పులలో బాల్య వివాహం ఒకటని పేర్కొన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగితే వెంటనే 1098 కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా సమన్వయకర్త వినోద్, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు సంపత్, కిరణ్, చైల్డ్ లైన్ సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

## డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించి నిజమైన పోరాట చరిత్రను తప్పుదోవ పట్టిస్తోందని డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేష్ ఆరోపించారు. ఆదివారం స్థానిక మాలీ సం ఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన జరిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం–వాస్తవాలు వక్రీకరణలు అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కనీసం పాత్ర లేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విలీనం అని, విమోచనం అని చరిత్రను వక్రీకరించి చెబుతున్నారన్నారు. ఇదే కాకుండా రజాకార్, కేరళ స్టోరీ కశ్మీర్ ఫైల్ పేరుతో తప్పుడు చరిత్రను ఆధారంగా చేసుకొ ని చిత్రాలు నిర్మించి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతాంగ పోరా ట చరిత్రను హిందూ, ముస్లిం పోరాటంగా చూపిస్తున్నారు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐబీజిల్లా కార్యదర్శి గొడి సెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం, దుర్గం నిఖిల్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం మంజూరు



**ఉట్నూర్, సెప్టెంబర్ 14 (ప్రభాత సమాచారం)**
ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం మంజూరైనట్లు ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ తెలిపారు. 2025–26 విద్య సంవత్సర నుండి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులలో ప్రవేశం కోసం దర ఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆదివాసీ గిరిజన పీవీ టీజీ విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తుందని, మారుమూల ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు అనేక ఆర్థిక సామాజిక కారణాల వల్ల ఉన్నత విద్యకు దూరంగా ఉన్న వారికి ఓపెన్ యూనివర్సిటీ రూ.500 మాత్రమే ఫీజుతో డిగ్రీ విద్యార్థులకు అడ్మిష న్లు ఇస్తామన్నారు. కోర్సులలో చేరే విద్యార్థులందరూ ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ నెం బర్ 235 కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన తరువాత ప్రింట్ తీసుకొని ఆ కాపీకి, సర్టిఫికెట్‌లను జతచేసి కళాశాలలో సమర్పించాలని ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ తెలిపారు. కోర్సుల అడ్మిషన్ల గడువును సెప్టెంబర్ 26 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.